# అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**కలెక్టర్ జితేశ్ వీ పాటిల్**

కామారెడ్డి, నవంబర్ 4 : జిల్లా వ్యయ పరిశీలకులు నిరంతరం అభ్యర్థుల ఖర్చును పరిశీలిస్తుంటారని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అధికారులకు అన్నారు. సి-విజిల్ యాప్‌ను నిరంతరం పర్యవేక్షిస్తూ ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల కదలికలను గమనిస్తుండాలని అన్నారు. ఏ నియోజకవర్గంలో ఎవరు విధుల్లో ఉన్నారో గమనిస్తూ సి-విజిల్ యాప్‌లో ఫిర్యాదు వచ్చిన వెంటనే స్పందించి సమీపంలోని ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలకు తెలిపాలన్నారు. తీసుకున్న చర్యలపై రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సామాజిక మాధ్యమాల్లో వస్తున్న రాజకీయ ప్రకటనలు, పేయిడ్ న్యూస్‌పై దృష్టి సారించాలన్నారు. 24 గంటలు పని చేసేలా కంట్రోల్ రూంలో అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి సురేందర్ కుమార్, శాంతి కుమార్, సతీశ్ యాదవ్, సాయి భుజంగం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

## బీడీ కార్మికులకు ఓటు వినియోగంపై అవగాహన



ఓటు వినియోగంపై అవగాహన కల్పిస్తున్న నోడల్ అధికారి

దోమకొండ, నవంబర్ 4 : ఓటు ప్రజాస్వామ్యానికి పునాది అని, ఓటు అనే రెండక్షరాల పదం దేశ చరిత్ర నే మార్చేస్తుందని స్వీప్ నోడల్ అధికారి శ్రీధర్ రెడ్డి అన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా శనివారం దోమకొండలో బీడీ కార్మికులకు ఓటు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు అనేది మనకు కల్పించిన హక్కని ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని గ్రామస్తులకు వివరించారు. అందరూ తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్మిక శాఖ సహాయక కమిషనర్ సురేందర్‌కుమార్, దేశాయ్ బ్రదర్స్ లిమిటెడ్ కంపెనీకి చెందిన సీనియర్ డివిజనల్ మేనేజర్ ఉమేశ్, బాయి పటేల్, గిరీశ్‌పటేల్, బీడీ కార్మికులు పాల్గొన్నారు

## ఆర్థికసాయం అందజేత

భిక్కనూరు, నవంబర్ 4 : భిక్కనూరు మండలం గుర్జకుంట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పోచవ్వ ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ శనివారం స్థానిక బీఆర్ఎస్ నాయకుల ద్వారా బాధిత కుటుంబ సభ్యులకు రూ.10 వేల ఆర్థికసాయాన్ని అందించారు. స్థానిక సర్పంచ్ కందడి మనోహరరమేశ్‌రెడ్డి 50 కిలోల బియ్యాన్ని అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ భూపాల్, నీలంరెడ్డి, యూత్ అధ్యక్షుడు రమేశ్, సంతోష్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మల్లేశ్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

## 10న మండల సర్వసభ్య సమావేశం

రాజంపేట్, నవంబర్ 4 : మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో ఎంపీపీ లింగాల స్వరూప అధ్యక్షతన ఈ నెల 10వ తేదీన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బాలకిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

## జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎంపిక



భాస్కర్‌ను సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

కామారెడ్డి, నవంబర్ 4 : తెలంగాణ విశ్వ విద్యాలయం నిజామాబాద్ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి భాస్కర్ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భాస్కర్‌ను శాలువాతో సత్కరించారు. ఈ నెల 8వ తేదీన కర్ణాటక రాష్ట్రంలో నిర్వహించే జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు కళాశాల తరఫున ప్రాతినిధ్య వహిస్తారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయ్ కుమార్, కళాశాల ఇన్‌చార్జి ఫిజికల్ డైరెక్టర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ కిష్టయ్య, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అరుణాచలానికి ప్రత్యేక బస్సు

ఖలీల్‌వాడి, నవంబర్ 4 : కార్తీక మాసాన్ని పురస్కరించుకొని అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జానారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27న అరుణాచలంలో జరిగే గిరి ప్రదక్షిణకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును డిపో-2 నుంచి ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. సర్వీస్ నంబర్ 9660 బస్సు ఈనెల 25న రాత్రి 8 గంటలకు నిజామాబాద్ నుంచి బయల్దేరి 26న ఉదయం 11 గంటలకు కాణిపాకం చేరుకుంటుందని తెలిపారు. విఘ్నేశ్వరుని దర్శనానంతరం మధ్యాహ్నం 2.30 గంటలకు వేలూర్ గోల్డెన్ ఆలయం చేరుకుంటుందని, దర్శనానంతరం సాయంత్రం 6.30 గంటలకు అరుణాచలం చేరుకుంటుందని తెలిపారు. గిరి ప్రదక్షిణ పూర్తయిన అనంతరం 27న తెల్లవారుజామున 5 గంటలకు బయల్దేరి, 28న ఉదయం 3 గంటలకు జోగులాంబ ఆలయానికి చేరుకుంటుందని, అక్కడినుంచి ఉదయం 9 గంటలకు బయల్దేరి 28న సాయంత్రం 7.30 గంటలకు నిజామాబాద్ చేరుకుంటుందని వివరించారు. పెద్దలకు రూ.4,200, పిల్లలకు రూ.3,400 చార్జీ ఉంటుందని, ఉమ్మడి జిల్లాల ప్రయాణికులు ఈ బస్సు సర్వీసును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టికెట్లను రిజర్వేషన్ కౌంటర్లలో లేదా www.tsrtconline.in ద్వారా బుక్ చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాల కోసం డిపో మేనేజర్ 9959226017, 7382844366, 7382846084 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.



మాట్లాడుతున్న ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జానారెడ్డి

## జిల్లా ముదిరాజ్ అడ్‌హక్ కమిటీ ఏర్పాటు

కామారెడ్డి, నవంబర్ 4 : కామారెడ్డి జిల్లా ముదిరాజ్ కుల సంఘం అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని జిల్లా అడ్‌హక్ కమిటీని ఏర్పాటు చేసినట్లు ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పున్న రాజేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డి జిల్లా ముదిరాజ్ ఎన్నికల అడ్‌హక్ కమిటీ కన్వీనర్‌గా గజ్జల భిక్షపతి, కో కన్వీనర్లుగా కుడుముల సత్యం, లింగాల కృష్ణమూర్తి, నంద రమేశ్, కాళ్ల గణేశ్, సభ్యులుగా లింగం, కడారి రమేశ్, సత్యనారాయణ, సాయిలు, శ్రీనివాస్, పిట్ల శ్రీనివాస్, నారాయణ, దుబ్బాక ప్రసాద్, సిద్ధిరాములును ఎంపిక చేసినట్లు తెలిపారు. గతంలో ఉన్న జిల్లా కమిటీని రద్దు చేస్తూ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని నూతన అడ్‌హక్ కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కమిటీ జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల్లో ముదిరాజ్‌లను చైతన్యం పరుస్తూ వారి సంక్షేమం కోసం పాటుపడాలని కోరారు.







కోనాపూర్, రాజంపేట, గర్గుల్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

# జోరుగా కొనసాగుతున్న ప్రచారం

బీబీపేట్/రాజంపేట్/కామారెడ్డి రూరల్/మాచారెడ్డి/దోమకొండ/భిక్కనూరు, నవంబర్ 4 : బీబీపేట్‌తో పాటు మాందాపూర్, ఉప్పర్‌పల్లి, ఇస్సానగర్, జనగామ, యాడారం, మల్కాపూర్, కోనాపూర్ తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు శనివారం ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. కామారెడ్డి నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్న సీఎం కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. రాజంపేటలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కామారెడ్డి మండలం గర్గుల్ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గర్గుల్ గ్రామ సర్పంచ్ రవితేజ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. మాచారెడ్డి మండలంలోని ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల బీఆర్ఎస్ పార్టీల అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు. దోమకొండతో పాటు అంచనూర్, అంబారీపేట్, ముత్యంపేట్, గొట్టిముక్కుల తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఎన్నిక ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. భిక్కనూరు మండలంలోని మోటాట్ పల్లి గ్రామంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరిస్తూ కారు గుర్తు ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.







పోతారం, దోమకొండ, మోటాట్‌పల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు